క్లుప్తంగా

సీనియర్ సిటిజన్స్‌కు నడక పోటీలు



ఒంగోలు వన్‌టౌన్: వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా ఒంగోలు మున్సిపల్ హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఒంగోలు ఆధ్వర్యంలో 1000 మీటర్ల నడక పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పోటీలలో మొదటి స్థానంలో ఉన్న ఎన్.సాంబయ్యకు ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు అవార్డు బహూకరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

24న హెచ్‌ఎంల సంఘం కౌన్సిల్ సమావేశం

ఒంగోలు సిటీ: జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కౌన్సిల్ సమావేశం ఈ నెల 24వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రధానోపాధ్యాయుల సంఘ భవనంలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఈసమావేశానికి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన కౌన్సిలర్లు అందరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు.

నేడు ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ


సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 22వ తేదీన శుక్రవారం పంచాయితీరాజ్ పురోగతి సూచికపై మండలస్థాయిలో అధికారులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, వీఆర్వోలకు ఒకరోజు శిక్షణ తరగతులు జరపనున్నట్లు ఎంపీడీవో డీ సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, వీఆర్వోలు, శిక్షణా తరగతులకు హాజరు కావాలని ఆయన కోరారు.

శివయ్యకు మాసశివరాత్రి పూజలు



ఒంగోలు మెట్రో: శ్రావణమాసం గురువారం మాస శివరాత్రి సందర్భంగా నగరంలోని పలు శైవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఒంగోలు కేశవస్వామి పేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండ్ తూర్పుపాలెం శివాలయం రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, అంజయ్య రోడ్డు శివసాయి పంచముఖ శివాలయం, బాలాజీ రావు పేట దుర్గా మల్లేశ్వరి దేవస్థానం, పాపా కాలనీలోని దుర్గా మల్లేశ్వరి దేవస్థానంలో ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్లకు పంచామృతాలు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో చక్కగా పుష్పాలంకరణ గావించి శివయ్యకు ప్రీతికరమైన బిల్వ దళాలతో అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శివాలయానికి దాతల విరాళాలు



ఒంగోలు మెట్రో: పురాతన భువనేశ్వరి సహిత పశుపతీశ్వర శివాలయానికి దాతలు విరాళం అందించారు. గురువారం శుభప్రదం కమ్యూనిటీ భవనంలో దాతలు మహంకాళి శేషయ్య సతీమణి నిర్మల జ్ఞాపకార్థం వారి కుమార్తె మహంకాళి కామాక్షి, రామకృష్ణ దంపతులు సమితి కోశాధికారి పింగళి పూర్ణచంద్రరావుకు రూ.1 లక్ష, తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.5 వేలు అందజేశారు. అనంతరం సమితి సభ్యులు మహంకాళి శేషయ్యను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సహాయక కార్యదర్శి సముద్రాల భీమశంకర్ శాస్త్రి, సభ్యులు మైనంపాటి సాయి, మేనేజర్ పరమాత్ముని నాగేశ్వర రావు, అగస్త్యరాజు శివ పాల్గొన్నారు.

బడిబయట పిల్లలు బడిలో ఉండాలి

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): బడికి వెళ్లాల్సిన పిల్లలు అందరూ బడిలోనే ఉండాలని.. ఎవరూ కూడా బడి బయట ఉండకూడదని వక్తలు పేర్కొన్నారు. గురువారం సంతనూతలపాడు మండలం తక్కెళ్లపాడు గ్రామంలో సార్ఛ్ యాక్సెస్ టు జస్టిస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఆర్టీఈ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ చట్టం ప్రకారం 14 సంవత్సరాల్లోపు పిల్లలు అందరూ బడిలో ఉండాలని బడి బయట ఉండకూడదని చెప్పారు. గ్రామంలో డ్రాప్ అవుట్ పిల్లలు ఎవరు లేకుండా చూసుకోవడం మన అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ సోషల్ వర్కర్ ఎన్.బాలకాశమ్మ, సూపర్వైజర్ పార్వతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


ఉండ్రాలయ్యా.. వస్తున్నామయ్యా !






విగ్రహాలకు రంగులద్దుతున్న కార్మికులు

విశ్వావసు నామ సంవత్సరంలో వినాయక చవితి జరపడానికి నగర ప్రజలు సిద్ధమవుతున్నారు. వినాయకుడి పండగ ఈ నెల 27న బుధవారం రానునుంది. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో వినాయకుడి విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. కార్మికులు వినాయక విగ్రహాలకు రంగులు దిద్దుతున్నారు. కొన్ని చోట్ల సిద్ధమైన విగ్రహాలను ప్రజలు కొనుగోలు చేయడానికి వస్తున్నారు. ఏదిఏమైనా గతేడాది కన్నా ఈ ఏడాది ఎక్కువగా వినాయక విగ్రహాలు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని నగర ప్రజలు భావిస్తున్నారు. - సాక్షి ఒంగోలు







వివిధ రూపాల్లో ఉన్న వినాయక విగ్రహాలు







అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు



విగ్రహాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

రాష్ట్రంలో స్తంభించిన పరిపాలన



పడమటి నాయుడుపాలెంలో క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మేరుగు నాగార్జున

- ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, హత్యలు
- మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఇన్‌చార్జి నాగార్జున ధ్వజం

చీమకుర్తి రూరల్: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో పరిపాలన స్తంభించిపోయిందని.. ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, హత్యలు, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్‌చార్జి మేరుగు నాగార్జున పేర్కొన్నారు. గురువారం పడమటి నాయుడుపాలెం, పాటిమీదపాలెం, ఏలూరివారిపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా మేరుగ నాగార్జున పాల్గొని మాట్లాడుతూ.. ఒకపక్క రైతులకు కావాల్సిన ఎరువులు అందించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి అవగాహన, కార్యాచరణ, ముందుచూపు తేకపోవడంతో ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబు అనుభవం, విజనరీ అంటూ వ్యర్థ ప్రసంగాలు తప్పా ఆచరణలో లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లక్ష్మయ్య, మండల ఉపాధ్యక్షులు యన్నం శేషురెడ్డి, చీదర్ల శేషు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు రాజేంద్ర, సర్పంచ్ బొంతా కరుణప్రియ, ఎంపీటీసీ కూడలి అంజలి, మాజీ సర్పంచ్ కూరాకుల రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ కూరాకుల సుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఒబులరెడ్డి ఆర్‌టిఐ వింగ్ అధ్యక్షుడు బొంతా సంతోష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గండి రోశయ్య జిల్లా కార్యదర్శి కూడలి మాలకొండయ్య, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య , శేషాద్రి, మండల నాయకులు జి సుబ్బారావు యర్యగుంట్ల మోహన్, వసంతరావు, కూడలి శ్రీను, బక్కా సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పద్ధతి మారకుంటే టెర్మినేట్ చేస్తా

- ఐసీడీఎస్ అధికారులకు కలెక్టర్ హెచ్చరిక



ఐసీడీఎస్ అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని.. నిర్లక్ష్యంగా ఉండేవారికి అసలు ఉద్యోగాలు ఎందుకని ఐసీడీఎస్ అధికారులను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా హెచ్చరించారు. ఐసీడీఎస్. అధికారులతో గురువారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ తరపున చేయాల్సిన కనీస విధుల నిర్వహణలోనూ నిర్లక్ష్యంగా ఉండే వారికి ఉద్యోగం ఎందుకు ? పద్ధతి మార్చుకోకపోతే టెర్మినేట్ చేస్తానని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల ఎత్తు, బరువుకు సంబంధించిన వాస్తవ వివరాలను కాకుండా, ఊహాజనిత వివరాలను కొందరు నమోదు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. డిపార్ట్‌మెంట్ తరపున చేయాల్సిన కనీస విధుల్లోనూ నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని హెచ్చరించారు. అప్పటికీ అంగన్వాడీ కేంద్రాల్లోని సిబ్బంది పనితీరులో మార్పు రాకపోతే నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చి విధుల్లో నుంచి తొలగిస్తానని చెప్పారు. ఏమైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని పీడీని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీఓ దినేష్ కుమార్, సీడీపీఓలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసనలు



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసనకు దిగిన అంగన్‌వాడీలు

చీమకుర్తి: రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ నల్లరిబ్బన్‌లను ధరించి బ్లాక్ డేని పాటించారు. జీతాల కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు గతంలో 42 రోజులు ధర్నాలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. జీతాలు పెంపు, ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను అందించాలని తమ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రంను డిటీకి అందించారు. సీఐటీయూ సంఘం వారికి సంఘీభావం తెలిపింది. మండల నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయ, మాధవి, శారద, స్థానికులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మద్దిపాడు ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.ధనలక్ష్మి, సంఘ నాయకులు ఎం .నాగేంద్రం, రాధిక, పద్మ, అంజమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అంగన్‌వాడీల నిరసన

ఒంగోలు సబర్బన్: అంగన్‌వాడీ వర్కర్స్‌కు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఒంగోలు ప్రాజెక్ట్ కమిటీ డిమాండ్ చేసింది. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట గురువారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ ఓ వైపు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, అంగన్‌వాడీ కార్మికుల వేతనాలు పెంచడంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దారుణమన్నారు. ఆన్‌లైన్ పనిభారాన్ని, ఎఫ్ఆర్ఎఫ్ యాప్‌ను రద్దు చేయాలని, చిరు జీతగాళ్లయిన అంగన్‌వాడీ కార్మికులకు వ్యక్తిగతంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ అధికారి ఎస్ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ ఒంగోలు ప్రాజెక్ట్ కార్యదర్శి కె.ఎమీమా, రాజేశ్వరి, అంజున జయలక్ష్మి, విజయ, మంజు, పద్మ, స్వప్న పాల్గొన్నారు.

ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించిన జేసీ

ఒంగోలు సబర్బన్: నగరంలోని మామిడిపాలెం ఎస్ఎస్ ట్యాంకు–1ను జిల్లా జాయింట్ కలెక్టర్, ఒడా వైస్ చైర్మన్ రోణంకి గోపాలకృష్ణ గురువారం పరిశీలించారు. ఒంగోలు అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ(ఒడా)అధికారులు, ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు, నగర కమిషనర్ కే.వెంకటేశ్వర రావులతో కలిసి కట్టపై పర్యటించారు. సాక్షి జిల్లా పేజీలో 'పచ్చదనంపై కుట్రలు' అన్న శీర్షికన కథనం ప్రచురించింది. ఈ కథనంపై స్పందించిన జేసీ రెండు విభాగాల అధికారులతో కలిసి మామిడిపాలెం ఎస్ఎస్ ట్యాంకు–1 వాకింగ్ ట్రాక్‌పై పర్యటించారు. కట్టపై పదుల సంఖ్యలో ఎండిన కొబ్బరి చెట్లను, డ్రిప్ సిస్టం పరిశీలనగా చూశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఒడా ఆధ్వర్యంలో రూ.1.63 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి వేసిన శిలాఫలకాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడిపాలెం ఎస్ఎస్ ట్యాంకు వాకర్స్, డెమొక్రటిక్ లాయర్స్ ఫోరం సభ్యులు జాయింట్ కలెక్టర్‌ను కలిసి ట్యాంకుపై ఎండిన చెట్ల విషయం, ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్న నిర్లక్ష్యంపై కూడా వివరించారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన వారు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాచెప్పారు. కారుణ్య, ప్రత్యేక నియామక కోటాలో ఉద్యోగం పొందిన ముగ్గురికి గురువారం ఆమె నియామక పత్రాలు అందజేశారు. వీరిలో ఇద్దరు రెవెన్యూ శాఖలోకి, మరొకరు దివ్యాగుల సంక్షేమ శాఖలో నియమించారు. విధుల నిర్వహణలో నైపుణ్యం పెంచుకొని ఉన్నత స్థానానికి చేరుకునేలా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు సువార్త, కలెక్టరేట్ పరిపాలన అధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

ఒంగోలు మెట్రో: నగరంలోని మంగమూరు రోడ్డు వడ్డివానికుంటలో వేంచేసి ఉన్న సీతారామాంజనేయ దేవస్థానంలో రామలింగేశ్వర స్వామి, భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా వేద పురోహితులు మణిశర్మ విగ్రహ దాతలు రావినూతల శ్రీనివాసరావు భానురేఖ దంపతుల చేత విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అఖండ ప్రతిష్ఠాపన, రక్షాబంధన పూజ, నవగ్రహ మండపారాధన, పంచామృత అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాలు జంగా కృష్ణశాస్త్రి, వంశీకృష్ణ, మురళి శర్మ, చైతన్య కృష్ణ, దేవస్థాన ధర్మకర్తలు నాగాంజనేయులు నాగలత దంపతులు, పల్లవి హరికృష్ణ, అనంతలక్ష్మి స్థానిక భక్తులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి జిల్లా అదనపు న్యాయమూర్తి పూజలు



పూజలు చేస్తున్న జడ్జి లలిత

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం ఒంగోలు రెండో అదనపు జిల్లా జడ్జి పి.లలిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలకగా, అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందించి, స్వామివారి శేష వస్త్రాలు బహూకరించారు. న్యాయమూర్తి వెంట ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థి నాయకులపై కేసు కొట్టివేత

ఒంగోలు టౌన్: 2017లో నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థి నాయకులపై అక్రమంగా బనాయించిన పోలీసు కేసును గురువారం న్యాయస్థానం కొట్టివేసిందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017లో ఒంగోలు తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రగతి భవనం వద్ద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, జిల్లాలోని హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. అయితే ప్రగతి భవనంలో ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించినట్లు అప్పటి టీడీపీ ప్రభుత్వం విద్యార్థి నాయకులు సీహెచ్ వినోద్, కేఎఫ్ బాబు, చినపరెడ్డి, సీఐటీయూ నాయకురాలు పి.కల్పన, ప్రజా సంఘాల నాయకులు అత్తింటి శ్రీనివాసరావు, శ్రీనినివాసరావు శ్రీరాంలపై తాలుకా పోలీసుస్టేషన్‌లో అక్రమంగా కేసు బనాయించారు. గత 9 ఏళ్లుగా విచారణ అనంతరం మూడో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కేసును కొట్టివేసినట్లు తెలిపారు. కేసును న్యాయవాది దీకొల్లి వెంకటేశ్వర్లు వాదించారు.

బయోడైవర్సిటీతో భూమి సారవంతం

- జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి



బయోడైవర్సిటీ పద్ధతి వివరిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి

కొత్తపట్నం: మెట్ట వరి సాగులో బయోడైవర్సిటీ పద్ధతి పాటిస్తే భూమి సారవంతమై అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వీ సుభాషిణి పేర్కొన్నారు. బయోడైవర్సిటీ పద్ధతిపై గురువారం మండలంలోని అల్లూరు గ్రామ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లిపెసర 2 కేజీలు, పెసర 2 కేజీలు, ఉలవలు 2 కేజీలు, అలసందలు 2 కేజీలు, మినుములు 2 కేజీలు, తోటకూర 100 గ్రాములు, గోంగూర 250 గ్రాములు మొత్తం విత్తనాలను పొలంలో చల్లాలన్నారు. ఇవి మొలకెత్తిన తరువాత వర్షం పడటం కానీ, బోరు నీరు పెట్టిన తరువాత అవి కుళ్లి భూసారవంతానికి ఉపయోగపడుతుందన్నారు. గ్రామానికి చెందిన సీహెచ్ అంజయ్య 0.50, బాబులు 1.00 తన సొంత పొలంలో మెట్ట వరిసాగు బయోడైవర్సిటీ పద్ధతి మోడల్‌ను వేశారని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.కిషోర్‌బాబు, ఏఈవో అజయ్ కుమార్, వీఏఏ నాగలక్ష్మి, కోటేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు, వికాస్‌రెడ్డి, సురేష్, ప్రవీణ్ కుమార్, గోపిరాజ్, మాధురి, అరుణ, రైతులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల్లో తేడాలపై నిఘా పెంచాలి



మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్

ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా అన్ని రంగాల్లో తూనికలు–కొలతల (లీగల్ మెట్రాలజీ)అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం తన చాంబర్‌లో లీగల్ మెట్రాలజీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా లీగల్ మెట్రాలజీ కార్యాచరణపై నిర్వహించిన ప్రాథమిక సమావేశంలో ప్రధాన అంశాలపై లోతుగా సమీక్షించారు. ప్రధానంగా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలపై తనిఖీలు ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. ఎల్‌పీజీ డీలర్లపై తనిఖీలు కూడా తనిఖీలు చేయాలన్నారు. పెట్రోలు బంకుల్లో వాహనాలకు పెట్రోలు, డీజిల్ పోసే పంపులను తనిఖీలు ముమ్మరంగా చేయాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్లను, చౌక ధరల దుకాణాలపై తనిఖీలు, సిమెంట్, స్టీల్ దుకాణాలపై, బ్యాంకుల్లో అప్రైజర్ కాటాలను, హాస్పిటల్స్‌పై కూడా తనిఖీలు చేయాలన్నారు. రైల్వే స్టేషన్‌లు, బస్టాండుల్లో మరీ అక్రమాలు ఎక్కువగా ఉన్నాయని ఫీడ్ బ్యాక్ ఉందన్నారు. స్వీట్, బేకరీ షాపులపై, మరీ ముఖ్యంగా బంగారం దుకాణాల జోలికి అసలు వెళ్లడం లేదన్నారు. అన్ని రంగాల్లో తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. సమావేశంలో లీగల్ మెట్రాలజీ శాఖ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్ఎన్ మాధురి, డిప్యూటీ కంట్రోలర్ కే.ఐజక్‌లను యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో పి.స్వర్ణ (అసిస్టెంట్ కంట్రోలర్), అనిల్ కుమార్ (ఇన్‌స్పెక్టర్, ఒంగోలు), ఎండీ.కరిముల్లా (ఇన్‌స్పెక్టర్, పొదిలి), ఎస్‌కే.మోహిసిన్ (ఇన్‌స్పెక్టర్, మార్కాపురం)లు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి



రండీ టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమంలో పాల్గొన్న సంఘ నాయకులు

ఒంగోలు సిటీ: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ‘రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం’ చర్చా కార్యక్రమం స్థానిక పాత రిమ్స్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు రాంభూపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, ఏసురత్నం మహిళా విభాగం అధ్యక్షురాలు రజిత మానస తదితరులు పాల్గొన్నారు.